క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు

అనుమసముద్రంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వపరిపాలన సాగించే విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సచివాలయ ఉద్యోగుల జిల్లా యూనియన్ నాయకులు ఖాదర్‌వలి ఆధ్వర్యంలో మంగళవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయాల ద్వారా సాధించాలని 2019, అక్టోబర్ 2న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు మసూద్, వలం టీర్లు, గ్రామ ప్రజలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



జి శివమణి, వై వెంకట అభిరామ్

ఆత్మకూరు: ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఆత్మకూరు నుంచి జిల్లా క్రీడలకు ఎంపికైన విద్యార్థుల్లో ఇద్దరు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు తెలిపారు. ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జి శివమణి, ప్రియదర్శిని కళాశాల విద్యార్థి వై.వెంకట అభిరామ్ ఇటీవల జరిగిన అండర్–19 కేటగిరీలో ఎంపికయ్యారు. ఈ నెల 6వ తేదీ మదనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు కావలి విద్యార్థినులు

కావలి: రాష్ట్ర అండర్–17 కబడ్డీ ఎంపికలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం జరిగిందని, కావలిలో జవహర్ భారతి జూనియర్ కళాశాల విద్యార్థినులు క్రీడా ప్రతిభను చాటుకుని ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.శామ్యూల్‌రాజ్, పీడీ బ్రహ్మయ్య తెలిపారు. కీర్తన, అఖిల, మాలిని, రేవతి, శశిరేఖ ఎంపిక కావడంతో వారిని కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు అభినందించారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం సింగనపల్లిలో ఉదయం 11 గంటలకు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని మేకపాటి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సాయంత్రం 4 గంటలకు నెల్లూరు కలెక్టరేట్‌లో ఆత్మకూరు నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.


డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి

ఆత్మకూరు: వీఎస్‌యూ డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలు వెంటనే విడుదల చేయాలని, అవి విడుదల చేయకుండానే 5వ తేదీ నుంచి డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నించడం సరికాదని ఏబీవీపీ ఆత్మకూరు భాగ్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విధానంతో విద్యార్థులు నష్టపోతారని యూనివర్సిటీ అధికారులు పరిశీలించి ఇన్‌స్టంట్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి అర్జీల స్వీకరణ నేడు

సీతారామపురం: మండలంలోని 14 పంచాయతీల్లో భూ సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ ఎంవీ సుధాకర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండలంలోని 9 సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, భూములు ఆక్రమణలకు గురైనా, భూమి సాగులో ఉండి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోయినా అర్జీలు సమర్పించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోర్టు ప్రాంగణంలో పిచ్చి మొక్కల తొలగింపు



శుభ్రం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శోభ

కావలి: స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా కావలి కోర్టు ప్రాంగణంలో సోమవారం కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కోర్టు ప్రాంగణంలో పిచ్చి మొక్కలను చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి, బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ కాటా సురేందర్‌రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జీ కృష్ణమోహన్, న్యాయవాదులు సాయి ప్రసాద్, ఓ బాలాజీ, పి.సునీల్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ధాన్యసిరులు

ఖరీఫ్‌లో వరి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో అధిక దిగుబడులు రావడంతో పాటు మద్దతు ధర కూడా లభిస్తుండడంతో అన్నదాత ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో రైతులు దోపిడీలకు గురయ్యేవారు. మిల్లర్లు, దళారులు డిమాండ్ లేదని, నాణ్యత లేదని కుంటి సాకులు చెబుతూ మద్దతు ధర ఇవ్వకుండా అన్నదాతలను దగా చేసే వారు. వీటికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మద్దతు ధరకే నేరుగా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. గోతాల దగ్గర నుంచి రవాణా వారకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది.

- ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు
- ఆశించిన స్థాయిలో దిగుబడులు
- ప్రభుత్వం మద్దతు ధరతో అన్నదాతల జోష్



కల్లాల వద్దే రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి లారీలకు ఎత్తుతున్న దళారులు

ఆత్మకూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రెండో పంట ఖరీఫ్ దిగుబడులు ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. సాధారణంగా రెండో పంటలో ఎకరాకు రెండున్నర.. మూడు పుట్ల మధ్య (పుట్టి 860 కేజీలు) దిగుబడి వచ్చేది. అయితే అందుకు భిన్నంగా ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఎకరాకు మూడు పుట్లకుపైగా కొన్ని గ్రామాల్లో నాలుగు పుట్ల వరకు దిగుబడులు వచ్చాయంటే వ్యవసాయం పండగలా ఉందని రైతులు అంటున్నారు. జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు వారాలుగా వరి కోతలు జరుగుతూ పొలాల వద్దే కల్లాల్లో ధాన్యాన్ని దళారులు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. నెల్లూరు మసూరా ఎన్‌ఎల్‌ఆర్ 34449 సాధారణంగా సాగు అవుతుండగా, ఈ ఏడాది అధికంగా పలు మండలాల్లో కేఎన్‌ఎం 1638 రకం సాగు చేశారు. ఈ రకం వరి ఎకరాకు అధికంగా 4 పుట్ల వంతున దిగుబడులు వచ్చినట్లు రైతులు తెలిపారు. ఈ రకం వరి అన్నానికి బాగుందని రైతులు అంటున్నారు.

మద్దతు ధరతో సంతోషం

ఈ ఏడాది ఖరీఫ్ వరి కోతలు మొదలు పెట్టినప్పటి నుంచి ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తోంది. నెల్లూరు మసూరి రకానికి పుట్టి రూ.16,500 నుంచి రూ.16,900 వరకు రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. కేఎన్‌ఎం 1638 రకానికి పుట్టి రూ.18,500 నుంచి రూ.19,900 వరకు ధర చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలి కారుతో సమానంగా దిగుబడులు రావడంతో పాటు ధరలు సైతం బాగుండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రానికి గతంలో ఏర్పాటు చేసి సాగు చేస్తున్న రైతుల వద్ద ఈ క్రాప్ నమోదు చేసుకొని ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులకు అప్పట్లో మద్దతు ధర లభించింది. అయితే ఈ సారి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకున్నా దళారులు రైతులకు పొలాల వద్దే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అత్యధికంగా సంగం మండలంలో 7 వేల ఎకరాల్లో సాగు అవుతుండగా, అతి తక్కువగా మర్రిపాడు మండలంలో 1,300 ఎకరాల్లో సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



యంత్రాల ద్వారా వరి కోత కోసి ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా కల్లాలకు తరలిస్తున్న దృశ్యం

ఈ ఏడాది దిగుబడి బాగుంది



ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రెండో పంటలో దిగుబడి బాగా వచ్చింది. నేను ఎకరా 30 సెంట్లలో వరి సాగు చేయగా 67 బస్తాల (బస్తా 74 కేజీలు) దిగుబడి వచ్చింది. ధర కూడా బాగుంది. కల్లంలోనే ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు.

– బొమ్మిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, బండారుపల్లి, ఆత్మకూరు మండలం

వాతావరణం అనుకూలంగా ఉంది



ఈ ఏడాది రెండో కారు ఖరీఫ్‌కు వాతావరణం బాగుండడంతో దిగుబడులు బాగా వస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు కేఎన్‌ఎం 1638 సాగు చేశారు. ఈ ధాన్యం నాణ్యతగా ఉండడంతో పాటు దళారులు కూడా ధర అత్యధికంగా చెల్లిస్తుండడంతో రైతులకు ఆదాయం వస్తోంది.

– శిధర్, వ్యవసాయ అధికారి, చేజర్ల

బాపూజీ ఆశయాలను అనుసరిద్దాం



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆత్మకూరు: ఎమ్మెల్యే కార్యాలయంలో..



ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో

ఆత్మకూరు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని వక్తలు అన్నారు. గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని సోమవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో వారి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ సుభద్ర, రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ బి.రాములు, పోలీసుస్టేషన్‌లో సీఐ జి వేణు, ఎస్సైలు కె ముత్యాలరావు, సాయిప్రసాద్, రాజేష్, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

సంగం: తహసీల్దారు కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి, చిత్రపటానికి డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్వేయర్ శాంతకుమారి, ఆర్యవైశ్య సంఘం నాయకులు వేమా మల్లికార్జునరావు, దుగ్గి అనిల్, రాజా, గిరి ఉన్నారు. ఎంఈఓ జానకీరాం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

చేజర్ల (సోమశిల): అనంతసాగరం గ్రంథాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గణిత, తెలుగు ఉపాధ్యాయులు కే సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లైబ్రేరియన్ నారాయణరావు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ రజియా బేగం అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలిసి జాతి నేతలకు నివాళులర్పించారు. తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో, నందవరం మోడల్ స్కూల్, మర్రిపాడు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు జాతీయ నేతలకు నివాళులర్పించారు.

ఆత్మకూరురూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తమ సిబ్బందితో కలిసి జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, ఆర్టీసీ డిపోలో డిపో మేనేజరు కరీమున్నీసా, గ్యారేజీ కార్మికులు జాతిపిత చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనుమసముద్రంపేట: మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, పరిపాలనాధికారి శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

చేజర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు. చేజర్ల బస్టాండ్‌లో బీజేపీ నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది మహాత్మాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిచారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ సహాయకులు ఎం.రమేష్ బాబు, టైపిస్ట్ శశికళాధర్ శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని 23 పంచాయతీల్లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.మల్లికార్జున, ఎంపీడీఓ శ్రీదేవి తమ కార్యాలయాల్లో, సచివాలయంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, కార్యదర్శి ప్రభుదాస్ గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఘనంగా గాంధీ జయంతి

జలదంకి: మండలంలోని అన్నవరం సచివాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్తమ్మ, పంచాయతీ కార్యదర్శి రేవతి, సచివాలయ కన్వీనర్ దామెర్ల దేవదాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మడి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు: గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్ సీపీ కార్యలయంలో జిల్లా కమిటీ సభ్యులు నీలం సాయికుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ శశిరేఖ, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఫణికుమార్, అల్లూరు–1 సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు.

సీతారామపురం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంవీ సుధాకర్ బాబు, మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు రామచంద్రయ్య, ప్రకాశం, మౌలాలి, ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం మహాత్మాగాంధీ జయంతి నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పాజిహా, పంచాయతీ కార్యాలయ ఆవరణలోని రైతుభరోసా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, ఎస్‌బీఐలో జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చేజర్ల: గ్రంథాలయంలో..



కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో..



ఆత్మకూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



ఏఎస్‌పేట: ఎంపీడీఓ కార్యాలయంలో..



దగదర్తిలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు



ఉయగిరి: ఆర్బీకేలో ..



అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో..



వరికుంటపాడు: తహసీల్దార్ కార్యాలయంలో..



జలదంకి: అన్నవరం సచివాలయంలో..

పెన్షనర్ల సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించి, వార్ధక్యంలో పెన్షన్లపై జీవనం సాగిస్తున్న పెన్షనర్లు తమ వంతుగా సమాజాభివృద్ధికి సంకల్పించి సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కావలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందించిన పెన్షనర్లకు సమాజంలో పేదల స్థితిగతులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుందన్నారు. సామాజిక పరిస్థితులను స్వయంగా చూసిన పెన్షనర్లు తమకు అవకాశం ఉన్న మేరకు పేద ప్రజలను ఆదుకునే మంచి పనులను సేవా కార్యక్రమాలుగా చేయడం హర్షణీయమన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం ద్వారా వారి కుటుంబాలకు ఉపాధి అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. వీరు చేస్తున్న సేవలకు దాతలు సైతం తమ వంతు సహకారం అందించి సమాజాభివృద్ధికి సహకరించాలని కోరారు. తనవంతుగా శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది మహిళలకు పెన్షనర్ల అసోసియేషన్ ద్వారా వితరణగా అందజేస్తానని సభికుల హర్షధ్వానాల నడుమ ఎమ్మెల్యే ప్రకటించారు. అక్కడే ఉన్న శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యులు కేతిరెడ్డి జగదీశ్వరెడ్డి తనవంతుగా ఉచిత కుట్టు శిక్షణ కోసం 5 కుట్టు మెషిన్లు వితరణగా అందజేస్తానని ప్రకటించారు. మరో ముగ్గురు కూడా 3 కుట్టు మెషిన్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యులు కేతిరెడ్డి జగదీశ్వరెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు ఆకుల రమణయ్య, సాయిరాం సింగ్, కొణిదెల రఘురామయ్య, రవికుమార్, ఏపూరు వెంకయ్య, చాకలి కొండ శారద, రావి కోటిరెడ్డి, ఆదిశేషులు, నాగేశ్వర రావు, జమున, సుకన్య పాల్గొన్నారు.

గాంధీ ఆలోచనలే జగనన్న పాలన

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ట్రంక్‌రోడ్డులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: జాతిపిత మహాత్మాగాంధీ ఆలోచనలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలుగా పరిపాలన చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి, పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సచివాయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు తదితర భవనాలు ఏర్పాటు చేసి పల్లె ప్రజల వాకిట్లో ప్రభుత్వ పాలన చేర్చిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం అంటే ఇదే అని చెప్పారు. గాంధీ ఆశయాలను పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, జంపాని రాఘవులు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, షేక్ షాహుల్ హమీద్, తిరువీధి ప్రసాద్, గుర్రం వెంకటేశ్వర్లు, కనుపర్తి రాజశేఖర్, మండలి కృష్ణారావు, డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, చీదెళ్ల కిషోర్, కొమారి రాజు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తలపనేని ప్రభాకర్‌నాయుడు, దండా కృష్ణారెడ్డి, షేక్ నాయబ్ రసూల్, పుత్తూరు నాగాచారి పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి



సబ్ జైల్లో గాంధీ చిత్రపటానికి నివాళులు

కావలి: కావలి సబ్ జైలు, డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ జైల్లో గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. మొదట గాంధీ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. సబ్ జైలు సూపరింటెండెంట్ కె.చిన్నసుబ్బయ్య, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ డి.మనోహరరెడ్డి, డైరెక్టర్ కె.తాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ తప్పులు చేసి జైలుకు వచ్చి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, పరివర్తన చెంది, జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో సమాజంలో కలిసి ఉన్నత జీవితం గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు. అనంతరం ఖైదీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

90.40 శాతం పింఛన్లు పంపిణీ



బట్టేపాడులో ఎద్దనపూడి శీనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రావణి



ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హరిత



ఆస్పత్రిలో వెంకటేశ్వర్లుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలోని రెండో రోజు సోమవారానికి 90.40 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మొత్తం 5,020 మంది లబ్ధిదారులకు గానూ 4,531 మందికి నగదు వలంటీర్ల ద్వారా పంపిణీ చేసినట్లు వివరించారు.

మర్రిపాడులో 86.76 శాతం..

మర్రిపాడు మండలంలోని 15 సచివాలయాల పరిధిలో సోమవారానికి 86.76 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ మస్తాన్ ఖాన్ తెలిపారు. మొత్తం 6,394 మందికి గానూ 5,551 మందికి నగదు అందజేసినట్లు తెలిపారు.

ఒంగోలుకు వెళ్లి పింఛన్ అందజేత

అల్లూరు: అనారోగ్యంతో ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని తూర్పుగోగులపల్లికి చెందిన శీనమ్మ చికిత్స పొందుతుంది. ఆమెకు వలంటీర్ ఆర్.హరిత సోమవారం తన సొంత ఖర్చులతో ఒంగోలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వితంతువు పింఛన్ అందజేయడంతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సంగం: సంగంకు చెందిన ఆలూరు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో నెల్లూరులోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో వలంటీరు శ్రీనివాసులు మంగళవారం ఆస్పత్రికే వెళ్లి పింఛను అందజేశాడు. ఆలూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో పింఛన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడేవారమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ ద్వారా మా వద్దకే పింఛన్ అందిస్తున్నారని తెలిపారు.

83 శాతం పింఛన్లు పంపిణీ



వెంకట్రావుపల్లిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు మాలిని

ఆత్మకూరు: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా సోమవారం నాటికి 83 శాతం మున్సిపల్ పరిధిలో పంపిణీ చేసినట్లు కమిషనర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. తొలిరోజు ఆదివారం కావడం, కొన్ని చోట్ల సర్వర్ సరిగా పనిచేయని క్రమంలో కొంత మేర ఆలస్యమైందని, రెండో రోజు సోమవారం ముమ్మరంగా పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఆత్మకూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డి అన్నారు. స్థానిక అభిరామ్ ఆస్పత్రిలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, మేకపాటి దీప్తి ఆధ్వర్యంలో సోమవారం మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. సీఐ జి వేణు, ఎస్సై కె ముత్యాలరావు, ఎంవీఐ బి.రాములు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సాధిక్‌హుస్సేన్, పట్టెడ మురళీ, నందవరం ప్రసాద్ పాల్గొన్నారు.